కాఫీ పండ్ల రకాలను బట్టి గ్రేడింగ్

ప్రజాశక్తి-పాడేరు : కాఫీ పండ్ల రకాలను బట్టి గ్రేడ్లు నిర్ధారించాలని అధికారులను ఇన్చార్జి జాయింట్ కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీ పూజ ఆదేశించారు. శనివారం చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్ను సందర్శించారు. ఈ సందర్భంగా భాగంగా కాఫీ పండ్లను, పార్చ్మెంట్ను పరిశీలించారు. పండ్ల గ్రేడ్లు ప్రకారం పార్చ్మెంట్, డ్రాయింగ్ చేయాలని ఆదేశించారు. అరకు కాఫీకి అత్యున్నత ప్రాధాన్యత ఉందని, దీనికి తగినట్టుగా రైతులు కష్టపడి లాభాలు ఆర్జించాలని సూచించారు. ప్రభుత్వం తరఫున ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ కాఫీ ఏడి జి అప్పలనాయుడు, బోర్డ్ మెంబర్స్, కాఫీ సిబ్బంది, లైజన్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

కాఫీ యూనిట్ను పరిశీలిస్తున్న పిఒ

శిథిలావస్థలో ఉన్న పాఠశాల

శిథిలావస్థలో ప్రాథమిక పాఠశాల

- మరమ్మతుకు నోచని స్లాబ్
- వర్షానికి కారిపోతున్న వైనం
- విద్యార్థులకు తప్పని అవస్థలు

తరగతి గదిలోకి చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని భీమవరం పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ట్రైబల్ వెల్ఫేర్) శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 1990 సంవత్సరంలో నిర్మించిన ఈ పాఠశాల భవనానికి నేటికి 35 సంవత్సరాలు పూర్తయ్యాయి. అప్పటి నుంచి సరైన మరమ్మతులు చేయక పోవడంతో భవనం పూర్తిగా శిథిల స్థితికి చేరుకుంది. ప్రస్తుతం ఈ పాఠశాలలో 13 మంది గిరిజన విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వర్షాలు పడితే తరగతి గదులలోకి వర్షపు నీరు చేరి, నేల మొత్తం నీటితో నిండిపోతుంది. శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో, ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనం పరిస్థితి దయనీయంగా మారినా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చిన్నారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో తరగతులు సక్రమంగా జరగక పిల్లల భవిష్యత్తు అంధకారమవుతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్త పాఠశాల భవనం నిర్మించాలని లేదా తక్షణమే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాల భవనం నిర్మించాలి

నూతన పాఠశాల భవనం నిర్మాణం చేపట్టాలి. విద్యార్థులు చదువుకునేందుకు ఇబ్బంది లేకుండా చూడాలి. శిథిల వ్యవస్థ పాఠశాలలో విద్యా బోధన ప్రమాదకరంగా ఉంది. తక్షణమే అధికారులు స్పందించి పాఠశాల భవనం పూర్తి చేయాలి.

నైని సన్యాసిబాబు,
భీమవరం పంచాయతీ సర్పంచ్

తక్షణమే మరమ్మతు చేయాలి

పాఠశాల భవనం ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలి. ప్రస్తుతం పాఠశాల భవనం సరిగా లేక విద్యార్థులు విద్యాభ్యాసానికి భయాందోళనలకు గురవుతున్నారు. తక్షణమే మరమ్మతు చేయాలి.

కోటి బాబు
పెసా కమిటీ అధ్యక్షులు

సంతలో కుళ్లిన చేపలు విక్రయిస్తే చర్యలు

చేపలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -హుకుంపేట :హుకుంపేట వారపు సంతలో శనివారం అధికారులు చేప దుకాణాలపై అకస్మిక తనిఖీలు నిర్వహించారు. కుళ్లిన చేపలు విక్రయిస్తే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ హెచ్చరించారు. శనివారం పెసా కమిటీ సభ్యులు, మహిళా పోలీస్ జ్యోతి, సచివాలయ సిబ్బందితో కలిసి చేపల దుకాణాలను తనిఖీలు చేపట్టారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ, గిరిజనులను లక్ష్యంగా చేసుకొని తక్కువ ధరలకు చెడు చేపలు అమ్మితే చర్యలు తప్పవన్నారు. ఇది ప్రజల ఆరోగ్యానికి పెద్ద ముప్పు అని పేర్కొన్నారు. చేపల దుకాణాలపై ఎర్ర రంగు తార్పాలిన్ కప్పి, చేపలు తాజాగా ఉన్నట్లు చూపిస్తూ వ్యాపారులు మోసానికి పాల్పడుతున్నారని అధికారులు గుర్తించారు. టార్పాలను తొలగించి చేపలను పరిశీలించగా నాసిరకం, కుళ్లిన చేపలు కనిపించినట్లు తెలిపారు. నకిలీ వస్తువులు, కుళ్లిన చేపలు, నిషేధిత మాంసాహార విక్రయాలు చేస్తే సంబంధిత వ్యాపారులపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పంచాయతీ కార్యదర్శి హెచ్చరించారు. పెసా కమిటీ మండల అధ్యక్షులు చప్పాలి శంకరరావు మాట్లాడుతూ, పరిసర ప్రాంతాల సంతలన్నింటిలో ఇలాంటి పరిస్థితులే నెల కొన్నాయన్నారు.అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా వారపు సంతల్లో విచ్చలవిడిగా కుళ్లిన చేపల అమ్మకాలు జరుపుతున్నారని ఆయన ఆరోపించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వారపు సంతల్లో కూళ్లిన చేపలు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పేసా ప్రధాన కార్యదర్శి జన్ని. వెంకటరమణ, జనరల్ సెక్రటరీ శెట్టి జయరాం కుమార్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల టీచర్లకు వేతనాలు చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-అరకులోయరూరల్:అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఈ నెల 6వ తారీకు వచ్చినా ఇప్పటికీ జీతాలు చెల్లించకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి దేముడు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి నెలా జీతాల కోసం ఎదురు చూసే పరిస్థితి నెలకొనడం అన్యాయమని పేర్కొన్నారు.జీతాలు సకాలంలో అందక పోవడంతో చాలా మంది ఉపాధ్యాయులు తమ నెలవారీ వాయిదాలు చెల్లించలేక పెనాల్టీలు, అప్పు బకాయిలు చెల్లించే దుస్థితికి చేరుకున్నారని తెలిపారు. ఇళ్ల ఖర్చులు, అనారోగ్యంతో బాధ పడుతున్న వారి వైద్య ఖర్చులు, పిల్లల స్కూల్ ఫీజులు, హాస్టల్ ఫీజులు, నిత్యావసరాల కొనుగోలు వంటి మధ్యతరగతి కుటుంబాల సమస్యలు మరింత తీవ్రం అవుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం 1వ తేదీన జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, నమ్మి ఓటేసి గెలిపించిన ఉపాధ్యాయుల ఆశలు నేడు తీరడం లేదన్నారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మఠంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి -హుకుంపేట : మండలంలోని మఠం గ్రామంలో జ్ఞానసాగర్ వృత్తి విద్యా కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక శిబిరాన్ని శనివారం గ్రామ సర్పంచ్ మఠం శాంతికుమారి చేతుల మీదుగా ప్రారంభించారు. తదనంతరం జరిగిన సమావేశంలో సర్పంచ్ శాంతికుమారి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి అంకితభావం, సేవా దృక్పథం కలిగి ఉఇమంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలన్నారు.. ఎన్ఎస్ఎస్ సేవా భావాన్ని జీవితాంతం కొనసాగించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ మాలతి పట్నాయక్ మాట్లాడుతూ, ఈ ప్రత్యేక శిబిరాన్ని ఈనెల 12 వరకు నిర్వహిస్తామన్నారు. ఈ వారంలో గ్రామ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, సేవలు అందించడంలో విద్యార్థులు కృషి చేయాలన్నారు.ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. జాతీయ సేవా పథకం విశిష్టత, విలువలు, శిబిరంలో చేయవలసిన కార్యక్రమాలను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రవికిరణ్ పట్నాయక్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వనవాసి మహిళా సంఘం అధ్యక్షురాలు అచ్చమ్మ, సత్యసాయి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్, దూరువీధి ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, గిరిజన మోర్చా అధ్యక్షుడు కొండబాబు, ఓంశాంతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్

ఏరియా ఆసుపత్రికి ఆక్సిజన్ పరికరాల వితరణ

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ఏరియా ఆసుపత్రికి ఓఎన్జిసి 20 ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు, 40 ఆక్సిజన్ సిలిండర్లు అందజేసింది. ఈ సందర్భంగా రాజమండ్రి ఓఎన్జీసీ డీసీఎంఓ డాక్టర్ వై.రామ్మోహన్ మాట్లాడుతూ పాడేరు, తాజంగి ఆసుపత్రులతో పాటు కింగ్ జార్జ్ ఆసుపత్రికి (కేజీహెచ్)కు మొత్తం 200 ఆక్సిజన్ సిలిండర్లు, 200 ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు అందించినట్లు చెప్పారు. భవిష్యత్తులో కూడా ఆరోగ్య రంగంలో సహకారం అందించాలని చింతపల్లి ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.నీలవేణి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ అనస్థీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రమేష్, రాజమండ్రి ఓఎన్జీసీ హెచ్ఆర్ యశ్వంత్ అంబటి, ఏరియా ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

పరికరాలను ఇస్తున్న ఓఎన్జిసి ప్రతినిధులు

బట్టపనుకులకు రోడ్డు వేయరూ..!

ప్రజాశక్తి - కొయ్యూరు : తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని బట్టపనుకుల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామం మీదుగా నిర్మించిన జాతీయ రహదారి 516 ఇ నిర్మాణం చేపట్టడంతో రోడ్డు ఎత్తు పెరగడంతో గ్రామం లోతట్టు ప్రాంతంలో ఉండిపోయింది. దీంతో గ్రామస్తులు రోడ్డుపైకి రావాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగులను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు కూడా అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. గ్రామానికి జాతీయ రహదారికి మధ్యలో ఉన్న ప్రాంతంలో కల్వర్టు నిర్మిస్తే రహదారి సమస్య తొలగుతుందని ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని, గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారి నిర్మాణ సంస్థ యాజమాన్యం త్వరితగతిన రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాళ్లు తేలిన బట్టపనుకుల రహదారి

104 సేవలను మరింత పటిష్టంగా అందించాలి

ప్రజాశక్తి- దేవీపట్నం : ఇందుకూరుపేట పిహెచ్సి పరిధిలో నిర్వహిస్తున్న 104 సేవల నిర్వహణపై బుధవారం జిల్లా మేనేజర్ నరేష్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా 104 సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. 104 సేవలు మరింత పటిష్టంగా అమలయ్యే దిశగా పూడిపల్లి గ్రామస్తులను 104 వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి క్రాంతి సౌజన్య,104 డిఇఒ రమేష్, పైలట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్హెచ్జి సభ్యులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎస్హెచ్జి సభ్యులకు అవగాహన

ప్రజాశక్తి-మారేడుమిల్లి: మారేడుమిల్లి మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య వెలుగు కార్యాలయంలో మన డబ్బులు మన లెక్కల కార్యక్రమం నిర్వహించి ఎస్హెచ్జి సంఘాలకు అవగాహన కల్పించారు సంఘాలు ఎలా పొదుపు చేయాలి. నిధులను ఏవిధంగా సక్రమంగా నిర్వహించాలి అనే విషయాలపై సెర్ఫ్, ఇఎంటిఎస్ ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆర్థిక క్రమశిక్షణ నైపుణ్యత పెంపొందించాలనే లక్ష్యంతో భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంఎంఎస్లు కానెం విజయలక్ష్మి, తిరుపతమ్మ, వెంకటలక్ష్మి ఐబీ ఏపీఎం మధుబాబు, ఎపిఎం దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

పర్యాటక వాహనదారులు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి: పర్యాటక వాహనదారులు భద్రతా నియమాలను విధిగా పాటించాలని రంపచోడవరం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాజేష్ తెలిపారు. శనివారం మారేడుమిల్లిలో వారపు సంత, పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, స్థానిక వనవిహారీ ప్రాంతం వద్ద ఎంవిఐ ఆధ్వర్యంలో అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ, ప్రతి వాహన చోదకుడికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరని స్పష్టం చేశారు. వాహనాల్లో ప్రయాణించేటప్పుడు సీట్బెల్ట్ ధరించడం, వాహనాలకు సంబంధించిన రికార్డులు కచ్చితంగా వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలను నడిపినట్టు తేలితే, శాఖాపరమైన చర్యలు తీసుకుని, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిబంధనలు పాటించని 14 వాహనదారులకు జరిమానా విధించారు. మొత్తం సుమారు రూ. 1,04,240 జరిమానాలు వసూలు చేసినట్లు తెలిపారు.

హోంగార్డ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న సిబ్బంది

ఘనంగా హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి -సీలేరు: జికెవీధి మండలం సీలేరులో 63వ హోంగార్డ్స్ (రైజింగ్ డే) ఆవిర్భావ దినోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎపి జెన్కో హోంగార్డులు పిక్నిక్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎపి జెన్కో ఇన్చార్జి ఎస్ఇ సివిల్ చెన్నకామేశ్వరరావు, ఇఇ రాజేంద్రప్రసాద్, ఎస్ఐ యాశీన్తో పాటు ఇంజనీర్లు స్నేహితులను ఆహ్వానించారు. ప్రతి ఏడాది ఆవిర్భావ దినోత్సవాలను మరింత ఘనంగా నిర్వహించాలని ఇన్చార్జి ఎస్ఇ సివిల్ చిన్నకామేశ్వరరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీ జెన్కో ఇఇలు రాజేంద్రప్రసాద్ పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఇఇ భాస్కర్రావు, ఇన్చార్జి ఇఇ సివిల్ జైపాల్, అకౌంట్ ఆఫీసర్ ఇవివి సత్యనారాయణ, ఎడిఇ అప్పలనాయుడు ఎఇఇ సిహెచ్ సురేష్, ఎపి జెన్కో సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అదుపులో కారుకోడిని పట్టుకున్న వ్యక్తులు

ప్రజాశక్తి -మారేడుమిల్లి: మారేడుమిల్లి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం పరిధిలో వన్యప్రాణి సంరక్షణ చట్టం ఉల్లంఘనకు సంబంధించి కేసు నమోదు చేశారు. ఏలూరు జిల్లా మండవల్లి గ్రామానికి చెందిన వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో ఆధారంగా కేసు నమోదు చేసినట్లు రేంజ్ ఆఫీసర్ ఎస్ఏ కె.ఆజాద్ తెలిపారు. కుర్రవాడ గ్రామ సమీపంలోని అడవిలో కారుకోడిని పట్టుకుని వీడియో తీశారు. ఆ వీడియోను సోషల్మీడియాలో పోస్టు చేశారు. అది గుర్తించిన ఫారెస్ట్ అధికారులు ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. విచారణ పూర్తయ్యిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన్యప్రాణులకు ఆహారం పెట్టడం, వాటిని పట్టుకోవడం, వేటాడడం వాటికి హాని కలిగించే చర్యలు తగవని అటువంటి చర్యలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

అప్పన్న మృతి పార్టీకి తీరని లోటు

ప్రజాశక్తి -కూనవరం : మండలంలోని రేగులపాడు గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకుడు తిమ్మా అప్పన్న శుక్రవారం మృతి చెందారు. శనివారం ఆయన మృతదేహాన్ని సిపిఎం నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పన్న రెండు పర్యాయాలు సర్పంచ్ గా సిపిఎం తరపున పోటీ చేసి గెలుపొందారని గుర్తు చేసారు. ఆయన పంచాయతీని అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, పాయం సీతారామయ్య, మండల కమిటీ సభ్యులు బొగ్గా సుబ్బయ్య, బొగ్గా రామారావు, నానుపల్లి వెంకటేశ్వర్లు, గుండం బాబురావు, తిమ్మ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఐ పి.రమేష్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి -చింతూరు: బాల్యవివాహాలు చేయటం చట్టరీత్యా నేరమని చింతూరు ఎస్ఐ పి.రమేష్ పేర్కొన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో బాల్యవివాహ నిరోధక కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఐ మాట్లాడుతూ జిఒఎంఎస్ 1, 31 కోసం అవగాహన కల్పించారు. ప్రతినెలా మొదటి, మూడో శుక్రవారం విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం విధిగా నిర్వహించాలని, ఆ సమావేశంలో ప్రతి కిశోరి బాలల హక్కుల కోసం చర్చించాలని సూచించారు. ఎంపిడిఒ సుండం శ్రీనివాస్దొర మాట్లాడుతూ గ్రామంలో డ్రాప్అవుట్స్ సర్వే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిఎల్ పిఒ, సిడిపిఒ, డిప్యూటీ ఎంపిడిఒ, సచివాలయ కార్యదర్శులు, విఆర్ఒలు, ఆర్ఒలు, ఏఎన్ఎంలు, అంగన్వాడి వర్కర్స్ పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ యాసీన్

విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించాలి

ప్రజాశక్తి -సీలేరు: విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్సై యాసీన్ సూచించారు. జీకే వీధి మండలం ఎపి గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. పాఠశాల పరిసరాల్లో దుకాణదారులు మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుచ్చిబాబు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -గంగవరం: రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా వైసిపి నాయకుల ఆధ్వర్యంలో జిఎంపాలెం జగ్గంపాలెం పంచాయతీలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఎంపిపి పల్లాల కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఉపయోగపడే కాలేజీలను టిడిపి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం చాలా అమానుషమన్నారు. కార్యక్రమంలో రామతులసి, కో ఆప్షన్ సభ్యులు కళ్లెం ప్రభాకర్, సర్పంచ్లు చోడి అబ్బాయిదొర, శివ, కామరాజు, మరిడమ్మ, మండల ఇంచార్జ్ రఘు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

పాడేరులో నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-పాడేరు : అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ క్యాంపు కార్యాలయంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా టిడిపి డివిజన్ నాయకులు దారెల సర్పంచ్ పాండురంగ స్వామి మాట్లాడుతూ, .భారత రాజ్యాంగ నిర్మాణానికి రూపకర్తగా ప్రపంచంలో ఖ్యాతి పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్జా అచిబాబు, మెడికల్ ఉద్యోగుల సంఘం నాయకులు శెట్టి నాగరాజు, టిడిపి యువజన నాయకులు పాల్గొన్నారు.

కాశీపట్నం:డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతిని అనంతగిరి మండలం చిలకలగడ్డ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుడు నరాజీ మల్లేశ్వరరావు అధ్యక్షతన అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సైమన్, వ్యాయామ ఉపాధ్యాయుడు శెట్టి లక్ష్మణ్, యుటిఎఫ్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు శెట్టి రాంబాబు, చిలకలగడ్డ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాల సాధనకు అనుగుణంగా అందరం నడుద్దామన్నారు. అంబేద్కర్ రాజ్యాంగంలో సూచించిన మన హక్కులు, చట్టాలను కాపాడుకుందామని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను సాధిస్తాం అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదబయలు : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి అధికారులు, పలు సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ కొల్లి రమణ, మండల పరిషత్ ఏఓఎల్ పూర్ణయ్య, వైసిపి నాయకులు జి.సూరయ్య, జిల్లా విఆర్ఓల సంఘం అధ్యక్షులు సిహెచ్.రమేష్, వర్తక సంఘం నాయకులు పిచ్చుక గౌరీ, నల్ల సాంబశివరావు, కటకం చిరంజీవి, బిసిబి జిల్లా అధ్యక్షులు మొగలిపూరి రాధాకృష్ణ, లంక భద్రరావు, జిసిసి సేల్స్‌మేన్ రెడ్డి సత్యనారాయణ, ఎస్ఎం మహాధీర్ పాల్గొన్నారు

కొయ్యూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని గిరిజన సంఘం జిల్లా నాయకుడు సూరిబాబు తెలిపారు. శనివారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెఎసి నేతలు నర్సి పాపారావు, పుల్లయ్య, బాచి. సురేష్, ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కాశీపట్నంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

సీలేరులో నివాళుర్పిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

సీలేరు: జికె వీధి మండలం సీలేరులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక పోస్టాఫీస్ సమీపంలో అంబేద్కర్ విగ్రహానికి ఎపి జెన్కో (ఓఅండ్‌డాం) ఎస్ఇ సీలేరు కాంప్లెక్స్ ఇన్‌చార్జి ఎస్ఈ సివిల్ చిన్న కామేశ్వరరావు, రిటైర్డ్ ఎస్ఈ సెల్ చంద్రశేఖర్‌రెడ్డి ఇఇ రాజేంద్రప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇఇ సివిల్ జైపాల్ ఎడిఇ అప్పలనాయుడు, ఎఇఇలు సిహెచ్ సురేష్, అనుదీప్, అకౌంట్ ఆఫీసర్ సత్యనారాయణ, ఎస్సీ అసోసియేషన్ నాయకులు వై.సత్తిబాబు, ఆనంద్, సుకుమార్, ఇంజనీర్లు సబ్ ఇంజనీర్లు అభిమానులు పాల్గొన్నారు.

జికె వీధి: మండలంలోని రింతాడలో అంబేద్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. మన్యపుత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, డిప్యూటీ తహసిల్దార్ దుమంతి సత్యనారాయణ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారికి రక్తనిల్వలు అందించారు. డాక్టర్ రాఘవేంద్ర ఈ సందర్భంగా మన్యపుత్ర యువజన సంఘం సభ్యులను అభినందించారు. మన్యపుత్ర యువజన సంఘం అధ్యక్షులు మడపల సోమేశ్‌కుమార్‌కు అభినందన ధ్రువీకరణ పత్రం, అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని బహుకరించారు. కార్యక్రమంలో జికే విధి ఎస్పై సురేష్ కుమార్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గంగరాజు, సున్నె, పాలకవర్గ సభ్యులు,ల్యాబ్ టెక్నీషియన్, ఉద్యోగ సంఘ అధ్యక్షులు పాతను రామరాజుపడాల్, సంఘ కార్యదర్శి రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: నివాళులర్పిస్తున్న గిరిజన సంఘ జిల్లా నాయకుడు సూరిబాబు

నేరాలు ఘోరాలు

ఘటన ప్రదేశంలో ఉన్న కారు, బైకు

బైక్‌ను ఢీకొన్న కారు

- ఉపాధ్యాయునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-చింతపల్లి : అంతర్ల-చింతపల్లి 516ఈ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో లంబసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సాగిన సోమలింగం తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. చింతపల్లి నుంచి అంతర్ల నివాస గృహానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఉపాధ్యాయుడు సాగిన సోమలింగం రోడ్డు దాటుతుండగా, వెనుక నుండి వేగంగా వస్తున్న కారు సోమలింగం బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోమలింగం తలకు బలంగా గాయమై కింద పడిపోయాడు. ఆ సమయంలో ఆసరాడ నుంచి వస్తున్న వైసిపి జీకే వీధి మండల మాజీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణరావు తన కారులో చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆయనను వెంటనే విశాఖపట్నం కింగ్ జార్జ్ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు.చింతపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

80 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- జిమాడుగుల: మండలంలో ఈదుల బయలు జంక్షన్ వద్ద జిమాడుగుల ఎస్పై షణ్ముఖరావు, పోలీస్ సిబ్బంది శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. పాడేరు వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేశారు. సుమారు 80 కిలోల ఎండు గంజాయి లభ్యమయ్యిందని స్థానిక ఎస్పై షణ్ముఖరావు తెలిపారు. కారులో ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు ఇద్దరు పెందుర్తి గ్రామానికి చెందిన వారు కాగా మరో ఇద్దరు జి మాడుగుల గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్టు తెలిపారు

లయన్స్ కేన్సర్ ఆసుపత్రికి విరాళం

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖపట్నంలోని లయన్స్ కేన్సర్ జనరల్ హాస్పిటల్ అభివృద్ధికి కీర్తిశేషులు కొసరాజు వెంకటేశ్వరరావు, సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు కొసరాజు స్వతంత్రకుమార్ రూ.1.50 లక్షల విరాళాన్ని హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావుకు అందించారు. కొసరాజు స్వతంత్ర కుమార్ సేవాతత్పరతను హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వి.ఉమామహేశ్వరరావు కొనియాడారు.

గంగమ్మతల్లి పండగకు పిఒకు ఆహ్వానం

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: మండలంలోని గసభ పంచాయితీ మొర్రిగుడ గ్రామంలో ఈ నెల 9న నిర్వహించనున్న గంగమ్మ తల్లి గ్రామ దేవత పండగకు ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీ పూజను ఆహ్వానించినట్లు స్థానిక గసభ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి సునీత తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ పండుగ డిసెంబర్ ఒకటి నుంచి 10 వరకు గ్రామంలో ఘనంగా జరుగుతుందన్నారు. గ్రామం తో పాటు చుట్టు పక్కల గ్రామాల గిరిజనులు హాజరై ఘనంగా జరుపుకుంటారని చెప్పారు. అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ పి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి హుకుంపేట :గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతను మెరుగుపరచడం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రూరల్ డెవలప్మెంట్ నిధులు విడుదల కావడంతో తాడిపుట్టు గ్రామ పంచాయతీలో పబ్లిక్ టాయిలెట్ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. . ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ సోమేలి సత్యవతి, ఎంపీటీసీ కిలగడ సింహాచలం కలిసి నిర్వహించారు. వారు మాట్లాడుతూ, గ్రామ సచివాలయం పక్కన ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా రూ. 3.50 లక్షల వ్యయంతో ఆధునిక పబ్లిక్ టాయిలెట్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. గ్రామస్తుల పరిశుభ్రత, ఆరోగ్య రక్షణ, ముఖ్యంగా సంతకు వచ్చిన ప్రజలు, మహిళలు, విద్యార్థులకు ఈ సదుపాయం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. సమస్యలను గుర్తించి పంచాయతీ ప్రజల అవసరాలను ప్రాధాన్యంగా తీసుకుని ఈ ప్రాజెక్టుకు నిధులను ప్రత్యేకంగా మంజూరు చేయించామని సర్పంచ్, ఎంపీటీసీ వెల్లడించారు. నీటి సౌకర్యాలు, పరిశుభ్రత వంటి అంశాలపై పంచాయతీ నిరంతరం దృష్టి పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు సోమేలి లక్ష్మయ్య, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కిలగడ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సత్యవతి తదితరులు

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎటిడబ్ల్యూఒ క్రాంతికుమార్

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన

ప్రజాశక్తి - కొయ్యూరు: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఎటిడబ్ల్యూఒ క్రాంతికుమార్ సూచించారు. కొయ్యూరు మండలం శరభన్నపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను శుక్రవారం రాత్రి ఆయన సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించి, అనంతరం వారితో కలసి భోజనం చేశారు. వంటశాల, భోజనశాల నిర్వహణకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశామన్నారు. స్టడీఅవర్స్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించామన్నారు.

'మెగా పిటిఎం 3.0పై వైసిపి నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదం'

ప్రజాశక్తి- జికె వీధి: మెగా పీటీఎం 3.0 సమావేశాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించలేదని దామనాపల్లి సర్పంచ్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని టిడిపి మండల అధ్యక్షుడు పుత్తూరు కొండలరావు విమర్శించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపిపి, సర్పంచులు, ఎంపిటిసిలు తదితర ప్రజాప్రతినిధులు ఇప్పటికే మెగా పీటీఎం 3.0 కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారని, పూర్తి వివరాలు తెలియకుండానే ఉపాధ్యాయులను విమర్శించడం బాధాకరమని కొండలరావు పేర్కొన్నారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు స్కూల్ కమిటీ, తల్లిదండ్రులను ప్రాధాన్యంగా ఆహ్వానించడం సహజమని, ప్రజాప్రతినిధు లను కూడా ఆహ్వానించారని, అందుబాటులో ఉన్న వారు సమావేశాలకు హాజరయ్యారని కొండలరావు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని సర్పంచ్ రాజకీయం చేయటం తగదని ఇది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని వ్యాఖ్యానించారు.

సప్పర్ల జిడబ్ల్యూటిఎస్ పాఠశాల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సప్పర్ల జిడబ్ల్యూటిఎస్ బాలుర పాఠశాలలో నెలకొన్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని గాలికొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మౌలిక వసతులన్నీ పూర్తి స్థాయిలో కల్పించినప్పుడే సమస్యలు పరిష్కారమవుతామయన్నారు. పాఠశాలలో 210 విద్యార్థులు ఉన్నారని వీరికి ఒక్కరే కుక్ ఉన్నారని, విద్యార్థులకు అదనపు తరగతి గదులు, ఉపాధ్యాయులకు క్వార్టర్స్ నిర్మించాల్సి ఉందన్నారు. తాగునీటి సమస్య ఉందని, పాఠశాలకు ప్రహరీ కూడా లేదని ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పాఠశాలకు మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పింఛన్ నగదు రికవరీ

ప్రజాశక్తి -కొయ్యూరు: మండలంలో ఎం.మాకవరం సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కంకిపాటి చైతన్య వరప్రసాద్ చింతలపూడి పంచాయతీ పరిధిలో లొద్దిపాకలు, లుబ్బర్తి గ్రామాల పింఛన్‌దారులకు పంపిణీ చేయాల్సిన రూ.2,88,000 పింఛన్ మొత్తాన్ని వారికి చెల్లించకుండా పరారైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనపై ఎంపిడిఒ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణలో వేగం పెరిగింది. తాజాగా చైతన్య వరప్రసాద్ కుటుంబ సభ్యుల నుంచి రూ.2,88,000 రికవరీ చేసి, తమకు అందజేసినట్లు అనంతరం ఈ మొత్తాన్ని సెర్ఫ్ ఖాతాలో చలానా ద్వారా జమ చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు. సంబంధిత శాఖాధికారులు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో తగిన చర్యలు తీసుకునే ప్రక్రియ కొనసాగుతున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

తూర్పు కోస్తా రైల్వేజోన్ జిఎం పరమేశ్వర్ ఫంక్వాల్

ప్రజాశక్తి- ఎంవిపికాలనీ: భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని తూర్పు కోస్తా రైల్వేజోన్ జిఎం పరమేశ్వర్ ఫంక్వాల్ ఆదేశించారు. శనివారం ఆయన విశాఖలో విస్తృతంగా పర్యటించారు. ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. విశాఖపట్నం-గోపాలపట్నం వడ్లపూడి గేట్ జంక్షన్ మధ్య జరుగుతున్న 3వ, 4వ లైన్ల పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్దేశించిన కార్యాచరణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు సకాలంలో పూర్తయ్యే లా చూడాలని అధికారులను ఆదేశించారు. సింహాచలం స్టేషన్‌ను సందర్శించి, 'అమత్‌భారత్‌స్టేషన్' పునరాభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. స్టేషన్ భవన నిర్మాణం, ఇతర వసతుల ఏర్పాటుపై ఆరా తీశారు. అనంతరం 72వ పురుషుల, 11వ మహిళల ఆల్ ఇండియా రైల్వే వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2025-26 ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సుమారు 180 మంది వెయిట్‌లిఫ్టర్లు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వాల్తేరు అధికారులను ఆయన అభినందించారు. విజేతలకు, రన్నరప్‌లకు ట్రోఫీలు, మెమొంటోలను అందించారు. అనంతరం జనరల్ మేనేజర్ 63వ పౌర రక్షణ దినోత్సవాలకు హాజరయ్యారు. తూర్పు కోస్తా రైల్వే , ఆగ్నేయ రైల్వే సంయుక్తంగా నిర్వహించిన పౌరరక్షణ ప్రదర్శనను తిలకించారు. డిఆర్ఎం లలిత్‌బోహ్రా, అధికారులు అజయ్‌సమల్, ఇ. సంతారాం, కె. రామారావు, ఎం.హరనాథ్, జుసుఫ్ కబీర్ అన్సారీ, ఆగ్నేయ రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్‌కుమార్ గుప్తా వంటి పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పురోగతిని సమీక్షిస్తున్న పరమేశ్వర్ ఫంక్వాల్

ప్రకృతి ఉత్పత్తులకు చేయూత ఇస్తాం

ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - ఎంవిపికాలనీ: సేంద్రియ రైతులు మన రాష్ట్రానికి ఉన్న ఆస్తి అని ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఇ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ప్రకృతి పంటల మేళాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్, ప్రైవేట్, సంయుక్త కార్యక్రమం ద్వారా చాలా ప్రాజెక్ట్స్ ముందుకు తీసుకు వెళ్తున్నామన్నారు. గ్రామీణ రైతుల ఎఫ్ పిఒల ద్వారా గ్లోబల్ నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం సెక్రటరీ చిరంజీవిచౌదరి, రైతు సాధికారత సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్, నాబార్డ్ రిటైర్డ్ ఎండి సూర్యకుమార్, భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి, అవని ఆర్గానిక్స్ ఉషాగజపతి రాజులు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సాధికారత సంస్థ ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాబూరావునాయుడు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరి రామకృష్ణ, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్యవర్మ, కార్యదర్శి పాలెంఅశోక్, ప్రకృతి రైతులు పిఎల్ఎన్ రాజు, ఎన్.నరేంద్ర, రిషి, శంకర్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, ప్రక తి రైతులు , సిద్ధ వైద్యులు పాల్గొన్నారు. మేళా నిర్వహిస్తున్న ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, వారాహి ఫెడరేషన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హలో వైజాగ్, టెర్రస్ గార్డెన్ గ్రూప్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ, అగ్రి డిఎన్ఎ వెంచర్స్ సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

రెయిన్‌బోలో అత్యవసర సేవలు ప్రారంభం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ:

భారతదేశంలోని ప్రముఖ పీడియాట్రిక్ మల్టీ-స్పెషాలిటీ పెరినాటల్ కేర్ హాస్పిటల్ రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సిరిపురం బ్రాంచ్‌లో 24/7 చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఒపి సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖబ్రతా బాగ్చి, ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశంలో సంతానోత్పత్తి రేటు 1.9 శాతంగా ఉందని, ప్రస్తుతం పరిస్థితుల్లో ప్రతి ఫ్యామిలీలో ఇద్దరు పిల్లలు ఉండటం చాలా కష్టంగా ఉందన్నారు. చిన్నారుల ఆరోగ్యాని కోసం హెల్త్‌ఎమర్జెన్సీ ఎక్కడా లేదని, మొదటసారి ఈ కేంద్రం ప్రారంభంతో ఆ సమస్య విశాఖపట్నంలో తీరిందన్నారు. ఈ సందర్భంగా రెయిన్‌బో హాస్పిటల్ సిబ్బందిని ఆయన అభినందించారు.

మాట్లాడుతున్న పోలీస్‌కమిషనర్ శంఖబ్రత బాగ్చి

వాణిజ్య పన్నుల శాఖ డివిజన్ సంయుక్త కమిషనర్‌గా వల్లి

కమిషనర్ పి.బి.వల్లి

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: వాణిజ్య పన్నులశాఖ, విశాఖపట్నం ఒకటో డివిజన్ సంయుక్త కమిషనర్‌గా పి.బి.వల్లి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఆమె అనంతపురం ఉపకమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వల్లిని డివిజన్ పరిధిలో సహాయక కమిషనర్లు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వల్లి అధికారులకు 2025-26 ఆర్థిక సంవత్సరం పన్నుల లక్ష్య సాధన ప్రణాళికను వివరించారు. జిఎస్‌టి సంస్కరణలు, పన్నుల రాబడి దృష్ట్యా విశాఖ ఒకటో డివిజన్ కీలకమైనదన్నారు.

ఉప కమిషనర్‌గా ఎం.హరీష్‌కుమార్

వాణిజ్య పన్నులశాఖ, విశాఖపట్నం ఒకటో డివిజన్ ఉప కమిషనర్‌గా ఎం.హరీష్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి రీజనల్ జిఎస్‌టి ఆడిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీస్, సహాయక కమిషనర్‌గా పనిచేస్తున్న హరీష్‌కుమార్ పదోన్నతిపై ఉప కమిషనర్‌గా విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. హరీష్ కుమార్‌ను డివిజన్ పరిధిలో సహాయక కమిషనర్లు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీష్‌కుమార్ అధికారులకు లక్ష్య సాధనకు ప్రణాళికను వివరించారు.

సమర్థవంతంగా ఓటర్ల జాబితా మ్యాపింగ్

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడటానికి జిల్లాలో ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ ఆదేశించారు. ముందస్తు ఎస్ఐఆర్ నేపథ్యంలో బాధ్యతగా వ్యవహరించాలని, ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికాయుతంగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. శనివారం ఆయన కలెక్టరేట్ మీటింగు హాలులో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, ఇఆర్ఒలు, ఎఆర్ఒలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఓటర్ల జాబితాలో భాగంగా నిర్వహించే మ్యాపింగ్ ప్రక్రియను పక్కాగా చేపట్టాలని సూచించారు. ఓటరు జాబితాలో వారి పేర్లు, తండ్రి, తల్లి పేర్లను ధ్రువీకరించడానికి 2002 సంవత్సరం ఓటరు జాబితాను పరిశీలనలోకి తీసుకోవాలన్నారు. 2002 జాబితాను 2025 నాటి జాబితాతో సరిపోల్చి వివరాలను నమోదు చేసుకోవాలని, ఆయా పోలింగ్‌స్టేషన్, నియోజకవర్గం వారీగా ఓటర్ల వివరాలను మ్యాపింగ్ చేయాలని సూచించారు. స్వీయ పత్రాల స్వీకరణ, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శక రీతిలో జరిగేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లాలో 24.54 శాతం మ్యాపింగ్

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ప్రక్రియలో భాగంగా ఇప్పటి వరకు 24.54 శాతం మ్యాపింగ్ జరిగిందని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సిఇఒకు వివరించారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో 20,20,726 మంది ఓటర్లు ఉండగా 2,81,415 మంది వివరాలను మ్యాపింగ్ చేశామని, మిగిలిన ప్రక్రియ కొనసాగుతోందని అన్నారు. వారసులు, ఇతర సంతానం తాలూకా వివరాలను కూడా జాగ్రత్తగా అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. అయితే జిల్లాలో దాదాపు అన్నీ పట్టణీకరణ ప్రాంతాలే కావటం, వలస కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల వివరాల సేకరణలో క్షేత్రస్థాయిలో కొంచెం క్లిష్టత ఏర్పడుతోందని ఇఆర్ఒలు సిఇఒ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఇఆర్ఒలు సంగీత్‌మాథుర్, దయానిధి, సుధాసాగర్, మధుసూదన్, సునీత, శేషశైలజ, జ్ఞానవేణి పాల్గొన్నారు.